*పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో*

## 98. అల్ బయ్యినహ్ సూరా పరిచయం

ఈ సూరా మదీనాలో అవతరించింది. 8 ఆయత్‌లు, ఒక రుకూ ఉన్నాయి.

గ్రంథం కలవారు బహుదైవారాధకులకు హజ్రత్ ముహమ్మద్ (స) దైవప్రవక్త అన్న విషయం స్పష్టంగా తెలిసినప్పుడు ఈ సూరా అవతరించింది. అయినప్పటికీ వారు ఆయనను తిరస్కరించారు. ప్రజలను కుఫ్ర్ (తిరస్కార) స్థితి నుండి వెలికి తీయడానికి, ప్రజల భేదాభిప్రాయాలను పరిష్కరించడానికి గ్రంథంతో పాటు, ప్రజల ఎదుట ధర్మాన్ని విశదపరచడానికి, తన వాక్కు, కర్మల ద్వారా స్పష్టం చేయడం కోసం ఒక ప్రవక్త అవసరం అన్న ఉద్దేశ్యం వెల్లడించబడింది. అందుకోసమే అల్లాహ్ హజ్రత్ ముహమ్మద్ (స)ను తన ప్రవక్తగా ప్రజల మార్గదర్శనం కోసం పంపాడు. ప్రజలు ప్రవక్తపై విశ్వాసం, ఆయన తెచ్చిన గ్రంథంపై విశ్వాసం ఉంచి ప్రవక్తకు విధేయత చూపడంలోనే ప్రజల సాఫల్యం ఇమిడి ఉంది.

శ్రేష్ఠత :ఒక హదీసులో ఉంది. దైవప్రవక్త (స) హజ్రత్ అబీ ఇబ్నె కాబ్ (రజి)తో "నీకు 'లమ్‌యకునిల్లజీన కఫరూ' వినిపించమని అల్లాహ్ నన్ను ఆజ్ఞాపించాడు" అన్నారు. హజ్రత్ అబీ ఇబ్నె కాబ్ (రజి) అడిగారు, "ఏమిటి! అల్లాహ్ నా పేరు పలికి ఈ ఆదేశమిచ్చాడా?" ఆయన (స) సెలవిచ్చారు : 'అవును' అని. ఇది విని అబీ ఇబ్నె కాబ్ (రజి) ఆనందభాష్పాలు రాల్చారు. (బుఖారీ – 4578)

హజ్రత్ అలీ ఇబ్నె కాబ్ (రజి) గ్రంథం కలవారిలోని వారు. దైవప్రవక్త (స)పై విశ్వాసం ప్రకటించారు. ఈ సూరాలో విశ్వాసులకు శుభవార్త ఉంది. అందుచేత అల్లాహ్ ఆయనపై గౌరవంతో ఈ సూరా ఆయనకు వినిపించమని తన ప్రవక్తను ఆదేశించాడు. అల్లాహ్ తరఫు నుండి ఈ గౌరవాన్ని చూసి ఆయన కంపించిపోయారు. ఇది విశ్వాసానికి ప్రబల నిదర్శనం.

## 98. అల్ బయ్యినహ్

**ఆయత్‌లు : 8** **అవతరణ : మదీనాలో**

*పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో*

(1) తమ వద్దకు స్పష్టమయిన నిదర్శనం ఏదీ రానంత వరకు, గ్రంథం కలవారిలో ముష్రికులు, తిరస్కారులయిన వారు తమ తిరస్కార ధోరణిని మానుకోని వారుగా ఉండేవారు. (2) అల్లాహ్ తరఫున పవిత్ర పుటలను చదివి వినిపించే ప్రవక్త (3) అందులో సత్యమైన సూటి అయిన ఆదేశాలు వ్రాయబడి ఉండాలి. (4) గ్రంథం ఇవ్వబడినవారు తీరా స్పష్టమైన బోధనలు వచ్చిన తర్వాత విభేదాలు, విభజనలలో పడిపోయారు.

آيَاتُهَا 8 سُورَةُ الْبَيِّنَةِ مَدَنِيَّةٌ 98 رُكُوعُهَا 1

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

لَمْ يَكُنِ الَّذِينَ كَفَرُوا مِنْ أَهْلِ الْكِتَابِ
وَالْمُشْرِكِينَ مُنفَكِّينَ حَتَّىٰ تَأْتِيَهُمُ الْبَيِّنَةُ ﴿1﴾
رَسُولٌ مِّنَ اللَّهِ يَتْلُو صُحُفًا مُّطَهَّرَةً ﴿2﴾
فِيهَا كُتُبٌ قَيِّمَةٌ ﴿3﴾
وَمَا تَفَرَّقَ الَّذِينَ أُوتُوا الْكِتَابَ إِلَّا مِن بَعْدِ مَا
جَاءَتْهُمُ الْبَيِّنَةُ ﴿4﴾

وَمَآ اُمِرُوْٓا اِلَّا لِيَعْبُدُوا اللّٰهَ مُخْلِصِيْنَ لَهُ
الدِّيْنَ ۙ حُنَفَآءَ وَيُقِيْمُوا الصَّلٰوةَ وَيُؤْتُوا
الزَّكٰوةَ وَذٰلِكَ دِيْنُ الْقَيِّمَةِ ؕ﴿5﴾
اِنَّ الَّذِيْنَ كَفَرُوْا مِنْ اَهْلِ الْكِتٰبِ وَالْمُشْرِكِيْنَ
فِيْ نَارِ جَهَنَّمَ خٰلِدِيْنَ فِيْهَا ؕ اُولٰٓئِكَ هُمْ شَرُّ
الْبَرِيَّةِ ؕ﴿6﴾
اِنَّ الَّذِيْنَ اٰمَنُوْا وَعَمِلُوا الصّٰلِحٰتِ ۙ اُولٰٓئِكَ هُمْ
خَيْرُ الْبَرِيَّةِ ؕ﴿7﴾
جَزَآؤُهُمْ عِنْدَ رَبِّهِمْ جَنّٰتُ عَدْنٍ تَجْرِيْ مِنْ
تَحْتِهَا الْاَنْهٰرُ خٰلِدِيْنَ فِيْهَآ اَبَدًا ؕ رَضِيَ اللّٰهُ
عَنْهُمْ وَرَضُوْا عَنْهُ ؕ ذٰلِكَ لِمَنْ خَشِيَ رَبَّهٗ ﴿8﴾ ع 1 8 23

(5) వారికి ఆదేశమైతే ఇదే అయింది. చిత్తశుద్ధితో కూడిన ఆచరణతో దైవారాధన చేయండి. ఏకాగ్రతతో నమాజ్ చేయండి. జకాత్ ఇవ్వండి. ఇదే సత్యధర్మం. (6) గ్రంథం కలవారు, ముష్రికులలో కుఫ్ర్‌కు పాల్పడ్డవారు నిశ్చయంగా నరకాగ్నిలో ప్రవేశిస్తారు. అందులో వారు శాశ్వతంగా పడి ఉంటారు. హీనాతిహీనమైన ప్రాణులు వీరే. (7) విశ్వసించిన వారు, సత్కర్మలు చేసినవారు నిస్సందేహంగా ఉత్తమ ప్రాణులు. (8) ప్రతిఫలంగా వారి ప్రభువు వద్ద స్వర్గంలో వారికి ఉన్నత స్థానం ఉంది. ఆ స్వర్గం క్రింద కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి. అందులో వారు శాశ్వతంగా వుంటారు. అల్లాహ్ వారి యెడల ప్రసన్నుడయ్యాడు. వారూ అల్లాహ్ పట్ల సంతుష్టులయ్యారు. ఈ బహుమానం తన ప్రభువుకు భయపడేవానికే (అంటే అల్లాహ్‌కు భయపడుతూ జీవితం గడిపేవానికే).

1 – 3 వాక్యాలు

పవిత్ర ఖుర్‌ఆన్ వరుస క్రమంలో సూరా అలఖ్, మరియు సూరా ఖద్ర్ తరువాత ఈ సూరా వచ్చింది. సూరా అలఖ్‌లో అది అన్నింటికన్నా మొదటి వహీ అని తెలుపబడింది. ఖద్ర్ సూరాలో అది లయ్‌లతుల్ ఖద్ర్‌లో అవతరింపజేయబడిందని తెలుపబడింది. బయ్యిన సూరాలో ఖుర్‌ఆన్‌తో పాటు ఒక ప్రవక్తను పంపడం ఎందుకు అవసరమో తెలుపబడుతోంది. మొట్టమొదట ప్రవక్తను పంపవలసిన అవసరం వివరించబడింది. ప్రపంచంలోని ప్రజలు, గ్రంథం కల వారిలోని వారయినా, ముష్రికులయినా, వారు కూరుకుపోయి వున్న కుఫ్ర్ స్థితి నుండి వారు బయట పడాలంటే సత్యవంతుడు, అమానతుదారు అయినవాడు, సుగుణాలలో ఉత్తమ స్థాయికి చెందిన ప్రవక్త రావాలి. వెనుకటి ఆకాశగ్రంథాలలో అధర్మంగా చేయబడిన మార్పులూ చేర్పులు లేకుండా పరిశుద్ధ పరచబడి, సత్యమయిన సక్రమమయిన బోధనలపై ఆధారపడిన దైవగ్రంథాన్ని దాని అసలు రూపంలో ప్రజల ఎదుట సమర్పించే వాడు అయిన ఒక ప్రవక్త లేకుండా సాధ్యం కాదు.

4 – 8 వాక్యాలు

ప్రవక్తలందరూ కేవలం అల్లాహ్‌ను ఆరాధించమని, ఆయనతో ఎవరినీ చేర్చవద్దనీ, నమాజ్ చేయమనీ, జకాత్ చెల్లించమని ఆజ్ఞాపించారు. యూదులు ఉజైర్‌ను అల్లాహ్ కుమారుడు అన్నారు. క్రైస్తవులు ఈసా (అ)ను అల్లాహ్ కుమారుడు అన్నారు. మక్కావాసులు ఇబ్రాహీం (అ) విధానాన్ని విడిచి ఆరాధించారు. గ్రంథం కలవారు, ముష్రికులు ఏకేశ్వరోపాసనను వదలి బహుదైవారాధన చేయసాగారు. వారికి హితబోధ మరియు సంస్కరణ కోసం అల్లాహ్ హజ్రత్ ముహమ్మద్ (స)ను ప్రవక్తగా చేసి పంపాడు. ఖుర్‌ఆన్ అవతరింపజేశాడు. అందులో సత్యమయిన, శుద్ధమయిన ఇస్లాంను సమర్పించడం జరిగింది. ఇక గ్రంథం కలవారు, ముష్రికులు ఈ ప్రవక్తను, ఖుర్‌ఆన్‌ను తెలుసుకోవడానికి తిరస్కరిస్తారు. వారు హీనాతి హీనులయిన ప్రాణులు. వారికి శిక్ష నరకం అవుతుంది. అందులో వారు శాశ్వతంగా ఉంటారు. ఇంకా ప్రవక్తను విశ్వసించినవారు, ప్రపంచంలోనూ బాగా ఉంటారు. పరలోకంలోనూ స్వర్గానికి అర్హులు అవుతారు. అక్కడ వారు సుఖ భోగాలతో జీవితం గడుపుతారు.